సాక్షి
శ్రీకాకుళం
సోమవారం। 26। ఫిబ్రవరి। 2024



వత్సవలసకు..

వత్సవలసకు తొలి వారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. - 8లో



అటెన్షన్ ప్లీజ్..

పదో తరగతి పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. - 8లో

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసేలా ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తంగి మురళీమోహనరావు అధ్యక్షతన ఆ సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. గాదె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు మే లు చేసిన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

బహడపల్లిలో భల్లూకాలు



బహడపల్లిలో సంచరిస్తున్న భల్లూకాలు

మందస: ఉద్దానంలో ప్రతి రోజూ ఏదో ఒక ప్రాంతం, గ్రామంలో ఎలుగుబంట్లు హల్‌చల్ చేస్తూనే ఉన్నాయి. మందస మండలంలోని బహడపల్లి గ్రామానికి ఆదివారం సాయంత్రం రెండు ఎలుగుబంట్లువచ్చేశాయి. దీంతో గ్రామస్తులు ఇళ్లల్లో దూరి తలుపులు వేసుకున్నారు. కొంతమంది మేడ మీద, తలుపుల సందుల్లో నుంచి సెల్‌ఫోన్లతో ఎలుగుబంట్లను చిత్రీకరించారు. అటూ ఇటూ తిరిగి తోటల్లోకి వెళ్లిపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

అరసవల్లిలో మాఘమాస సందడి



క్యూలో భక్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. వందలాది మంది భక్తులు తలనీలాలను సమర్పించుకుంటే.. మరికొందరు ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ దాతలకు, ప్రముఖ వ్యక్తులకు కూడా గోత్రనామాలతో పూజలు చేయించారు. ఇంద్రపుష్కరిణి ఆవరణలో పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి స్వామికి నివేదించారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంత మహిళలు సూర్యుని చిత్రపటం వద్ద కొత్త బెల్లం, చెరకు, పెసల మొలకలు ప్రసాదాలుగా సమర్పించారు. మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా ఒక్కరోజులో రూ. 9,61,537 వరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ తెలియజేశారు. దర్శనాలకు వివిధ టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,72,300, విరాళాలు, పూజల ద్వారా రూ.1,79,237, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.10 లక్షలు వరకు ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ తెలిపారు.

వలలో చిక్కిన కొండచిలువ



వలలో చిక్కుకున్న కొండచిలువ

శ్రీకాకుళం: శ్రీకాకుళం అటవీ రేంజ్ పరిధిలోని కనిమెట్ట గ్రామ సమీప పొలాల్లో ఓ కొండచిలువ వలలో చిక్కుకుంది. దీన్ని గ్రీన్‌మెర్సీ రెస్క్యూ టీం ఆదివారం కాపాడింది. చేపల కోసం వేసిన వలలో కొండచిలువ చిక్కుకున్న సమాచారాన్ని తెలుసుకున్న టీమ్ సభ్యులు వలను నేర్పుగా కత్తిరించి కొండచిలువను కాపాడారు. ఆపరేషన్‌లో సంస్థ సీఈఓ రమణమూర్తి, కంటి మహంతి సంప్ నేతృత్వం వహించారు. జిల్లా అటవీశాఖాధికారి నిషాకుమారికి విషయం తెలియజేసి, అటవీ సిబ్బంది సమక్షంలో అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. అనంతరం పాములపై స్థానికులు అవగాహన కల్పించారు.

'హిందీ ప్రచార సభలకు నిధులు కేటాయించాలి'

శ్రీకాకుళం కల్చరల్: హిందీ ప్రచార సభలకు కేంద్ర ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించి చేయూతనివ్వాలని హిందీ మంచ్ ఉత్తరాంధ్ర గౌరవాధ్యక్షుడు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు కోరారు. హిందీ మంచ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీహెచ్‌బీ కాలనీలోని పెన్షనర్ల భవన్‌లో హిందీ ప్రచార సభ హైదరాబాద్ వార్షిక డైరీల ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రచార సభ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొనె శ్రీధర్ మాట్లాడుతూ ప్రచార సభ గత 50 ఏళ్లుగా డైరీలు, క్యాలెండర్లను ముద్రిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా హిందీప్రచారానికి కృషి చేస్తున్న కొనె శ్రీధర్, దొంతం పార్వతీశంలను సత్కరించారు.

బడుగులకు సాయం.. బతుకులకు న్యాయం

- జిల్లా కేంద్రంలో 40 శాతం రాయితీపై 32 ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాటు
- ఒక్కో షాపు ద్వారా వారంలో 2టన్నుల చేపల విక్రయం



శ్రీకాకుళం: ఫిష్ ఆంధ్రా.. జిల్లా కేంద్రంలోని మత్స్యకారులు సంపూర్ణంగా వినియోగించుకుంటున్న కార్యక్రమం. మత్స్యకార మహిళలకే కాకుండా స్వయం ఉపాధి కోరే వారికి ఈ షాపులను మంజూరు చేస్తున్నారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ రుణంలో 40 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించింది. రూ.1.25లక్షలు, రూ.2.50లక్షలు మొత్తంలో షాపులను ఏర్పాటు చేయించారు. మత్స్యశాఖ అధికారులే బ్యాంకులతో మాట్లాడి రుణం మంజూరు అయ్యేలా చేశారు. ముఖ్యంగా నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో 15 షాపులను, కలెక్టరేట్ సమీపంలో నాలుగు షాపులు, బలగ ప్రాంతంలో ఒకటి, వాంబే కాలనీలో రెండు, పసగాడ సూర్యనారాయణ మిల్లు జంక్షన్‌లో రెండు ఇలా పలు ప్రాంతాల్లో 32 ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాటు చేశారు. షాపుల్లో తాజా చేపలు విక్రయిస్తుండటంతో కొనుగోలుదారులు అక్కడికే వెళుతున్నారు. ఒక్కో షాపులో వారానికి సుమారు రెండు టన్నుల చేపలు విక్రయిస్తున్నారు. నెలకు రూ.20వేలకు పైబడి ఆదాయం లభిస్తుంది. ఈ షాపులు నడుపున్న వ్యాపారులతో పాటు చేపలు కట్ చేసే వారికి కూడా జీవనోపాధి లభిస్తోంది.

నా పేరు బర్రి తోటమ్మ. శ్రీకాకుళం రూరల్ మండలం చిన్నగనగళ్లపేట గ్రామం. నా భర్త చేపల వేటకు వెళ్లి తెచ్చిన ఆదాయంతో మేం బతికేవాళ్లం. పిల్లల జీవితాలైనా బాగుపడాలని ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని ఎనిమిదేళ్ల కిందట శ్రీకాకుళం నగరానికి వచ్చేశాం. మండల వీధిలో నివాసం ఉంటూ రోడ్డు పక్కన చేపలు విక్రయించేదాన్ని. నా భర్త ఎప్పటిలాగే సముద్రంలో చేపల వేటకు వెళ్లేవారు. ఏదోలా ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మా జీవితాలు మలుపుతిరిగాయి. ఇద్దరు పిల్లలకు జగనన్న అమ్మ ఒడి పథకం వర్తించటంతో ఇంటర్, డిగ్రీ చదివిస్తున్నాం. ఈ తరుణంలో ఫిష్ ఆంధ్రా పథకం వచ్చింది. మత్స్యశాఖ అధికారులను సంప్రదించగా వారు బ్యాంకుతో మాట్లాడి రుణం ఇప్పించారు. రూ.2.50లక్షల అప్పులో రూ.70వేలు రాయితీ



ఇచ్చారు. గతంలో రోడ్డు పక్కన చేపలు విక్రయించినప్పుడు రోజుకు రూ.200 ఆదాయం మాత్రమే వచ్చేది. ఇప్పుడు ఫిష్ ఆంధ్రా షాపులో విక్రయిస్తుండటం వల్ల ఆదాయం పెరిగింది. వారానికి సుమారు మూడు టన్నుల చేపలు విక్రయిస్తున్నాను. నెలకు రూ.25వేలు పైబడి ఆదాయం వస్తుంది. నా భర్త కూడా షాపులో నాకు సహకరిస్తున్నారు.



శ్రీకాకుళం పాలిటెక్నికల్ కాలేజీ వద్ద ఫిష్ ఆంధ్రా షాపులు

ఇది కదా.. అభివృద్ధి

కుటుంబమంతా ఉపాధి



ఎచ్చెర్ల మండలంలోని మత్స్యకార గ్రామం నుంచి శ్రీకాకుళం నగరానికి వలస వచ్చాం. మా కుటుంబమంతా షాపుపైనే ఆధారపడి జీవిస్తున్నాం. నా కుమారుడు, మనవడు సముద్ర తీరానికి వెళ్లి చేపలు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. మా షాపులో వారంలో మూడు టన్నుల వరకు చేపలు విక్రయిస్తున్నాం. అవసరమైన వారు సంప్రదిస్తే హోల్‌సేల్‌గా సరఫరా చేస్తున్నాం. – చిన్నారావు, శ్రీకాకుళం

జిల్లాలో 148 షాపులు ఏర్పాటు



జిల్లాలో ఇప్పటి వరకు 148 ఫిష్ ఆంధ్రా షాపులు ఏర్పాటు చేశాం. వీటిలో 32 షాపులు శ్రీకాకుళం నగరంలో ఉన్నాయి. షాపులు ఎవరికి కావాలన్నా సంప్రదిస్తే వెంటనే మంజూరు చేస్తాం. బ్యాంకు రుణంలో రూ.1.75 లక్షలకు మాత్రమే 40 శాతం వరకు రాయితీ లభిస్తుంది. ఫిష్ ఆంధ్రా షాపులకు ప్రజాదరణ ఎక్కువగా ఉంది. –శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, మత్స్యశాఖ, శ్రీకాకుళం



పైడిభీమవరంలో ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్‌ఐ రీజనల్ డైరెక్టర్ వేణుగోపాల్

పైడిభీమవరంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రారంభం

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట రూ. 5.64 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈఎస్‌ఐ ఆరుపడకల ఆస్పత్రి, డయాగ్నస్టిక్ సెంటర్, డిస్పెన్సరీని పీఎం నరేంద్ర మోదీ గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పైడిభీమవరం విచ్చేసిన ఈఎస్‌ఐ రాష్ట్ర రీజనల్ డైరెక్టర్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో 20,910 మంది ఈఎస్‌ఐ కలిగిన కార్మికులు ఉన్నారని, వీరంతా కుటుంబ సభ్యులతో ఈ ఆస్పత్రిలో సేవలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ప్రస్తుతం రూ.21వేలు వేతనం లోపు మాత్రమే జీతం ఉన్న కార్మికులకు ఈఎస్‌ఐ సదుపాయం కల్పిస్తున్నామని, త్వరలో రూ.25వేలుకు పెంచే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందని వివరించారు. పైడిభీమవరంలో పాటు పూసపాటిరేగ, శ్రీకాకుళం, విజయనగరం చుట్టుపక్కల ఉన్న ఈఎస్‌ఐ కార్డు కలిగిన కార్మికులు ఈ ఆస్పత్రిలో సేవలు వినియోగించుకోవాలని కోరారు. మరో మూడు నెలల్లో ఆస్పత్రికి సంబంధించిన పరికరాలు, వైద్యులు అందుబాటులోకి వస్తారని చెప్పారు. సమావేశంలో విశాఖపట్నం ఈఎస్‌ఐ డీడీ జోష్ మార్టిన్, సూపరింటెండెంట్ కృష్ణ కిషోర్, విజయనగరం ఈఎస్‌ఐ వైద్యులు ఎం.జగదీశ్వరరావు, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ బి.హరినాథరావు, పంచాయతీ సర్పంచ్ సింక గౌరీభవాని, బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరావు ఉన్నారు.

50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌కు..

శ్రీకాకుళం: నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్ట్‌లో భాగంగా శ్రీకాకుళం రిమ్స్ ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. రూ.23.75 కోట్లు బ్లాక్ నిర్మాణానికి వెచ్చించారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజకోట్‌లో జరిగిన సమావేశం నుంచి దేశవ్యాప్తంగా హెల్త్‌కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రారంభాలు, శంకుస్థాపనలు చేయగా, మన రాష్ట్రంలో 9 క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీజీహెచ్ మెడికల్ కళాశాల నుంచి లైవ్ టెలికాస్ట్ ద్వారా కలెక్టర్, ఏపీహెచ్ఎం ఐడీసీ ఈఈ ఎం.సత్య ప్రభాకర్, సూపరింటెండెంట్ స్వామినాథన్, జిల్లా వైద్య ఆరోగ్య



రిమ్స్‌లో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన చేసిన కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

అధికారి బి.మీనాక్షి, మెడికల్ కళాశాల వెంకటాచలం, డిప్యూటీ సూపరింటెండెంట్ కె.సునీలా నాయక్, హెచ్‌డీఎఫ్‌సీ సలహా సభ్యులు సీఎస్‌ఆర్‌ఎం సుభాషిణి, ఎం.సత్యానంద్, విద్యార్థులు తిలకించారు. అనంతరం కలెక్టర్ శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు.

12.74 కిలోల గంజాయి స్వాధీనం

- ఒడిశా నుంచి బెంగళూరు తరలిస్తుండగా పట్టివేత



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: స్థానికులు సహకరిస్తే నిషేధిత పదార్థాల అక్రమ రవాణా అడ్డుకోగలమని కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వర రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆదివారం డీఎస్పీ జి.నాగేశ్వర రెడ్డి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ఎల్‌సీ గేట్ సమీపంలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన ముగ్గురు నిందితులను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకొని 12.74 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం మధ్యాహ్నం 2గంటల సమయంలో ఓడి08జె1001 నంబర్ గల మారుతీ కారును ఎల్‌సీ గేట్ వద్ద పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. కారులో రెండు బ్యాగ్‌లలో ఆరు ప్యాకెట్లలో 12.740 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితులను గంజాం జిల్లా డెంగాపదర గ్రామానికి చెందిన సమీర్‌బిసాయ్, దిగపహంటి బ్లాక్ కుమరాడా గ్రామానికి చెందిన జితేంద్ర ప్రదాన్, చీకటిబ్లాక్, జగన్మోహన్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తకోట చందన్ సుబుద్ధిగా గుర్తించి అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్‌లు, కారు స్వాధీనం చేసుకొని పట్టణ పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరు గంజాయిని ఒడిశాలోని కందమాల్ జిల్లా నుంచి బెంగళూరుకి అక్రమ రవాణా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానితులు మీ పరిసరాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అద్దెకు ఎవరికైనా ఇళ్లు ఇవ్వాల్సి వచ్చినా ఆధార్ కార్డు తదితర వివరాలు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ టి.ఇమ్మాన్యుయేల్, పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ, రూరల్ ఎస్‌ఐ ఎస్ లక్ష్మణ్ రావు, కవిటి ఎస్‌ఐ కె.రాము పాల్గొన్నారు.

సెపక్‌తక్ర స్టేట్‌మీట్‌లో జిల్లాకు మూడో స్థానం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర సెపక్‌తక్ర పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు మెరిసింది. నెల్లూరులో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన 26వ ఏపీ రాష్ట్రస్థాయి బాలబాలికల సబ్‌జూనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం బాలురు జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు, ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ట్రోఫీతోపాటు కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. జిల్లా క్రీడాకారుల బృందాన్ని, ముందుండి నడిపించిన కోచ్ అర్జున్‌రెడ్డిని జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

పాతికేళ్ల కల.. నెరవేరెనిలా..



నౌగాంలో ప్రారంభానికి సిద్ధమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- నౌగాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం నేడు
- 22 వేల మందికి అందుబాటులోకి వైద్యసేవలు

నందిగాం: పాతికేళ్లుగా కలలు కంటున్న నౌగాం వాసుల నిరీక్షణ ఈనాటికి నెరవేరింది. మండలంలోని కొండలప్రాంత వాసులకు వైద్య సేవలు అందించే నౌగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని సోమవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు సోమవారం ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ పేరుకే మంజూరు చేసి, పాడుబడిన ఒక ప్రభుత్వ భవనంలో ప్రారంభించి కొత్త భవనం నిర్మించకుండా వదిలేశారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాటి టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విన్నవించడంతో నాడు–నేడు కింద పీహెచ్‌సీ నూతన భవనం మంజూరు చేశారు. దీంతో రూ.కోటి 85లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. నౌగాం పీహెచ్‌సీ పరిధిలో కొండల ప్రాంతంలోని 8 సచివాలయాలు, 23 గిరిజన గ్రామాలలోని 22 వేల మందికి వైద్య సేవలు అందనున్నాయి. పీహెచ్‌సీకి కావల్సిన సామగ్రిని సమకూర్చడంతో పాతికేళ్లుగా ఉన్న ఈ ప్రాంతవాసుల కల నెరవేరనుంది.

మరింత మందికి సేవలు




నూతన భవనంలో మరింత మందికి మెరుగైన సేవలు అందించవచ్చు. గతంలో ఉన్న భవనంలో వైద్యసేవలు అందించడానికి ఇబ్బందిగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. త్వరలో మరిన్ని వైద్య పరికరాలు రానుండటంతో ఈ ప్రాంత గర్భిణులు, వృద్ధులకు సేవలు అందించే అవకాశం ఉంటుంది. త్వరలో ఇక్కడ ప్రసవాలు కూడా చేయించే అవకాశం వస్తుంది. – డాక్టర్ పి.అంజలి, నౌగాం వైద్యురాలు

కల నెరవేరింది..



గత పాతికేళ్లుగా కొండల ప్రాంతవాసులు మెరుగైన వైద్య సేవలు అందకుండా నానా ఇక్కట్లు పడేవారు. కానీ జగనన్న సాయంతో మెరుగైన సేవలు స్థానికంగా అందనున్నాయి. గర్భిణులకు, పాముకాటు వేసిన వారికి అత్యవసర సేవలు అందనుండటంతో ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – నడుపూరు శ్రీరామమూర్తి, ఎంపీపీ నందిగాం

సజావుగా గ్రూప్–2 పరీక్ష



శ్రీకాకుళంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



టెక్కలి: టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

20,554 మంది హాజరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని 82 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షకు 20,554 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మొత్తం 24,500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 3,946 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆధ్వర్యంలో జరిగాయి.

కాంప్లెక్స్ కిటకిట

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆదివారం కిటకిటలాడింది. గ్రూప్–2 పరీక్ష కావడంతో పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులతో ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ కిక్కిరిసిపోయింది. అలాగే సాయంత్రం కూడా రద్దీ కనిపించింది.



బస్సుల కోసం పోర్టికోల వద్ద వేచి ఉన్న ప్రయాణికులు

పూర్తిస్థాయిలో బందోబస్తు



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: గ్రూప్–2 పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి. ఆదివారం ఉదయం స్వయంగా పలు కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు.

ఉత్సాహంగా జిల్లా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్‌జూనియర్స్ బాలబాలికల బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఈ పోటీలు జరిగాయి. వివిధ బరువుల కేటగిరీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన క్రీడాకారులను మార్చి 1 నుంచి 3వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న 3వ ఏపీ రాష్ట్రస్థాయి బాలబాలికల సబ్‌జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్(అను) వెల్లడించారు. విజేతలకు వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో వంగా మహేష్, బాక్సింగ్ కోచ్ పి.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారుడికి పతకం అందజేస్తున్న దృశ్యం

ప్రాణం కాపాడిన ప్రభుత్వాస్పత్రి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి గుండెపోటుతో వచ్చిన బాధితుడికి ఖరీదైన ఇంజెక్షన్ చేసి ప్రాణాలు కాపాడారు. కంచిలి మండలం పెద్రిపుట్టుగ గ్రామానికి చెందిన పెద్రి సుందరరావు అనే ముప్పై ఏడేళ్ల యువకుడు గుండెనొప్పితో ఆదివారం ఆస్పత్రికి వచ్చాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యురాలు డాక్టర్ అగ్గున మేఘన ఆదేశాల మేరకు డ్యూటీ డాక్టర్ ఉంగ కిరణ్‌కుమార్ సిబ్బందితో కలిసి చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఈయనకు అందించిన ఇంజెక్షన్ విలువ రూ.38 వేల నుంచి రూ.44 వేలు మధ్య ఉంటుందని వారు తెలిపారు. అనంతరం అతడిని రిమ్స్‌కు పంపించారు. గుండెపోటుతో వచ్చే వారిని కాపాడేందుకు ఈ ఇంజెక్షన్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు.



రూ.40వేలు ఖరీదు చేసే ఇంజెక్షన్ ఇదే

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో నేషనల్ లా ట్రిబ్యునల్ సభ్యుడు



బద్రీనాథ్‌కు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ రమేష్‌బాబు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని నేషనల్ లా ట్రిబ్యునల్ సభ్యుడు (హైదరాబాద్ బెంచ్) డాక్టర్ నందుల వెంకట రామకృష్ణ బద్రీనాథ్ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను ఆయనకు అర్చకులు వివరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుంది



గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు

నరసన్నపేట: విశాఖ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద ఆదివారం ఇరుక్కుపోయింది. విశాఖ నుంచి గుణుపూర్ వెళ్లేందుకు వస్తున్న ఆర్టీసీ బస్సు నరసన్నపేట టౌన్ లోనికి వచ్చేందుకు సత్యవరం కూడలి వద్ద కట్ చేయాలి. డ్రైవర్‌కు ఈ దారి కొత్త కావడంతో ముందుకు వెళ్లి గొట్టిపల్లి ఫ్లై ఓవరు కింద నుంచి మారుతీ నగర్ మీదుగా నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు బస్సు తిప్పారు. దీంతో ఫ్లై ఓవరు వంతెన పై భాగం బస్సుకు తగలడంతో బస్సు ముందుకు కదల్లేదు. కాసేపటి తర్వాత టైర్లలో గాలి తగ్గించి వెనక్కి తీసుకువచ్చారు. మళ్లీ గాలి నింపి బస్సును యథావిధిగా తరలించారు. రెండు గంటల సమయం ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.

'రోగిని బంధువులా భావించాలి'



సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రోగిని బంధువుగా భావించి వైద్యం అందించాలని, అప్పుడే రోగి వైద్యుడిని దేవుడిలా చూస్తారని జెమ్స్ కళాశాల అధినేత బొల్లినేని భాస్కరరావు అన్నారు. మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పేద రోగులకు సాయం చేయాలని కోరారు. హౌస్ సర్జన్ అయిపోయాక పీజీ కోసం రెండు నెలలు కష్టపడితే అనుకున్న గోల్ రీచ్ అవుతామని చెప్పారు. సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఆస్పత్రి ఛైర్మన్ గురువారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల ఎంబీబీఎస్ ఒక ఎత్తు అయితే, జీవితాన్ని చదవాల్సిన సమయం ఇప్పుడు ఆసన్నమైందన్నారు. వైద్యంపై ఆసక్తి ఉండి చిన్నతనం నుంచే దాన్ని సాధించే దిశగా పరీక్షలు రాశారని, మీ తల్లిదండ్రుల కలలను సాకారం చేసే రోజు వచ్చిందన్నారు. ప్రతి వైద్యుడు కొత్త పాఠం రోగి నుంచే నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించి పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ సీఈఓ బొల్లినేని అద్విక్, సీఏఓ రామ్మోహన్‌రావు, జనరల్ మెడిసిన్ వైద్యులు సుధీర్, సూపరింటెండెంట్ అశోక్, ప్రిన్సిపాల్ లిలిత, ఆర్ఎంఓలు బాలమురళీ, ప్రవీణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి



యవ్వారి ప్రసాద్ (ఫైల్)

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలి-టెక్కలిపట్నం రహదారి భావనాపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొంపాపురం గ్రామానికి చెందిన యవ్వారి ప్రసాద్(32) అనే మర్చంట్ నేవీ ఉద్యోగి మృతి చెందారు. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ముక్తాపురం పంచాయతీ, చొంపాపురం గ్రామానికి చెందిన ప్రసాద్ బైక్‌పై వెళ్తూ భానవాపురం గ్రామం సమీపంలో ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రసాద్ మర్చంట్ నేవీలో పనిచేస్తున్నాడు. గత ఏడాది మే నెలలోనే వివాహమైంది. ఇటీవలే పాప కూడా పుట్టింది. సెలవుల్లో ఇంటికి వచ్చిన ప్రసాద్ ఆదివారం మధ్యాహ్నం అత్తవారింటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుని భార్య దీపిక ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వత్సవలసకు భక్తుల వరుస

వత్సవలసలో కొలువైన్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు తొలి వారం వరుస కట్టారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు ఇక్కడే బస చేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళల్లో అదనపు భద్రతా చర్యలను పోలీసులు తీసుకున్నారు. ముఖ్యంగా శ్రీకూర్మం కూడలి వద్ద నుంచి తూలుగు, ఎర్రగుడ్డి మీదుగా మళ్లీ శ్రీకూర్మం వరకు వన్‌వే ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు. – గార



అమ్మవారి ఆలయాల వద్ద భక్తులు



పూజలందుకుంటున్న రాజమ్మ తల్లి



భూలోకమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



భక్తులు తీసుకువచ్చిన వాహనాల పార్కింగ్

రైతు సమస్యలపై ప్రతిస్పందనే ఈ పుస్తకం



నాగలి కూడా ఆయుధమే పుస్తకాన్ని సభకు పరిచయం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రైతుల సమస్యలపై సానుభూతి చూపడమే కాకుండా వారి పోరాటాలకు ఊపిరి ఊదేలా విల్సన్ రావు 'నాగలి కూడా ఆయుధమే' కవితా సంపుటి ఉందని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఏవీఎస్ భవన్‌లో జరిగిన పుస్తక పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పుస్తక పరిచయం ప్రసంగం చేసిన కవి రచయిత డాక్టర్ కేజీ వేణు మాట్లాడుతూ వివిధ సామాజిక సమస్యల వల్ల ఆర్ద్రత, వేదనతో కూడా ప్రతి స్పందనలే ఈ కవిత్వం నిండా కనిపిస్తాయని అన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు డాక్టర్ కె.ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ రైతు, మహిళా, శ్రామిక, దళిత సమస్యలే వస్తువులుగా కవిత్వం రాశారని చెప్పారు. పుస్తక రచయిత కొమ్మవరపు విల్సన్ రావు మాట్లాడుతూ ఉద్యమాల పుట్టిల్లు శ్రీకాకుళంలో తన పుస్తక పరిచయ సభ సాహితీ వేత్తల సమక్షంలో జరగడం ఆనందదాయకమన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో చింతాడ రామారావు, వీజీకే మూర్తి, బాలభారతి, చింతాడ తిరుమలరావు, నెట్టిమి రమణారావు, బాడాన శ్యామలరావు, కంచరాన భుజంగరావు, పూజారి దివాకర్, డాక్టర్ ఎం. బలరామ నాయుడు, తంగి ఎర్రమ్మ తదితరులు మాట్లాడారు. సభకు కె.షణ్ముఖరావు ఆహ్వానం పలుకగా, పి.దివాకర్ వందన సమర్పణ చేశారు.

పాతపట్నం రైల్వే గేటును ఢీ కొట్టిన ఆటో



ఆటో ఢీ కొట్టడంతో విరిగిన గేటు

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్ జాతీయ రహదారి వద్ద ఉన్న రైల్వే గేటును ఆదివారం ఉదయం ఆటో ఢీ కొట్టడంతో గేటు విరిగిపోయింది. ఆదివారం ఉదయం పాతపట్నం నుంచి కొరసవాడ వస్తున్న ఆటో.. సైరన్ మోగుతుండగా స్పీడుగా రావడంతో గేటును ఢీకొట్టింది. దీంతో గేటు విరిగింది. ఉన్నతాధికారులు స్పందించి రైల్వేగేటును పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా బొడ్డపాడు యువజన సంఘ వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న విరసం నేత కాశీం

పలాస: శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాట సమయానికి ఇప్పటికి దోపిడీలో ఎలాంటి మార్పు లేదని ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి, విరసం నేత ప్రొఫెసర్ సి.కాశీం చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో బొడ్డపాడు యువజన సంఘం 70 వసంతాల వార్షికోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రధాన వక్తగా కాశీం పాల్గొన్నారు. బొడ్డపాడు యువజన సంఘం నాయకులు తామాడ గణపతి, సుబ్బారావు పాణిగ్రాహి, తామాడ చినబాబు, పోతనపల్లి అప్పారావు, మదనాల దుష్యంతు వంటివారి పోరాటాలను వివరించారు. జీడి పిక్కల ధర ఎందుకు తగ్గుతోందో యువత ఆలోచించాలన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు కోత ధర్మారావు, కేఎన్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మిష్క కృష్ణయ్య, రైతాంగ ఉద్యమ నాయకులు దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచనరావు, బచ్చల విప్లవకుమార్, కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు. సభ అనంతరం తెలంగాణ ధిక్కార స్వరం చుక్కా రామయ్య, వివిధ సాంస్కృతిక సంఘాలకు చెందిన కళాకారులు తమ ఆటా పాటలతో ప్రజలను అలరించారు.

మేలు చేసిన ప్రభుత్వానికి పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ కళింగ ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: మేలు చేసిన ప్రభుత్వానికి పట్టం కట్టాలని, కీడు చేసిన తెలుగుదేశం పార్టీని పాడి ఎక్కించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. నగరంలోని పీఎన్ కాలనీలో ఆదివారం వైఎస్సార్ సీపీకి చెందిన కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తాను అధికారంలో ఉన్నా లేకున్నా మీ స్నేహితుడిగానే ఉంటానన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో కళింగ కోమట్లు సజావుగా వ్యాపారాలు చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాను కాబట్టే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేసుకుంటూ ప్రశాంతంగా జీవిస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోనే వేల సంఖ్యలో ఇళ్ల పట్టాలు ఇచ్చామని, టీడీపీ హయాంలో ఒక్కటైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. మీ సహకారంతోనే మూడు సార్లు శ్రీకాకుళం నుంచి గెలవడం ఆనందంగా ఉందన్నారు.

కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం కళింగ వైశ్యుల పట్ల ఎంతో అభిమానంతో ఉందని, వైఎస్సార్ చేయూత, ఆసరా, నవరత్నాలు సంక్షేమ పథకాలన్నింటినీ అర్హులైన వైశ్యులకు అందించడంపై ఆయన హర్షం ప్రకటించారు. పీఎన్ కాలనీ, హయాతీనగరం పరిధిలో గల కళింగ కోమట్లకు సుమారు 182 ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు రాబోతున్నాయని, గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన సమక్షంలో ఎనిమిది సచివాలయాల పరిధిలో గల కళింగ కోమట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోణార్క్ శ్రీను, అంధవరపు సురేష్, ఉన్న నాగరాజు, కొండబాబు, దామెదరావు, అరుణ్ కుమార్ గుప్తా, డాక్టర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన కళింగ వైశ్యులు

అంబేడ్కర్‌ది అలుపెరుగని పోరాటం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్

రణస్థలం:

భారతీయ సమాజంలో అంటరానితనంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అలుపెరుగని పోరాటం చేశారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కొండములగాం పంచాయతీలో గల ముక్తుంపురం రెవెన్యూ పరిధిలో అంబేడ్కర్ సామాజిక భవన కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి సారథ్యంలో ఏర్పాటు చేసిన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌తో పాటు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ భారతీయ సమాజానికి దార్శనికునిగా నిలిచిన స్థితప్రజ్ఞుడైన అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు నడవాలని కొనియాడారు. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌ను కలిసి దళితులకు శ్మశాన వాటికలు కేటాయించాలని కోరగా.. పది రోజుల్లోనే జీఓ అమలు చేశారని ప్రశంసించారు. అలాగే విజయవాడ నడిబొడ్డున అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని స్థాపించారని గుర్తు చేశారు. అంబేడ్కర్ సామాజిక భవన నిర్మాణానికి కృషి చేస్తున్న అప్పలసూరి మాస్టారు, కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కిరణ్ కుమార్ మాట్లాడుతూ సామాజిక భవనం నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అంబేడ్కర్ విగ్రహాలు దళిత వాడల్లోనే కాకుండా గ్రామాల్లోనూ ఏర్పాటు చేసేందుకు సహకరిస్తామన్నారు. సమావేశంలో శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రజిని, మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షులు మల్లేశ్వరి, సాంఘిక సంక్షేమ శాఖ, ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.ఈశ్వరరావు, టీడీపీ నాయకులు కోండ్రు మురళీమోహన్, కె.అప్పలనాయుడు, కమిటీ సభ్యులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టరీ ప్రసాద్

వైఎస్సార్‌సీపీలో పలువురు చేరిక

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పిరియా విజయ సమక్షంలో ఆదివారం కంచిలి ఎంఎంసీ ప్రాంగణంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులు గుర్రు కృష్ణారావు, కొండే వంశీ, మడ్డు కోదండరావు, మద్దిలి పురుషోత్తం, మడ్డు జీవనరావు, ఉజ్వల గౌడా, మడ్డు కోదండ, కొక్కరి బాలరాజు, బొట్టా దానయ్య కుటుంబాలు జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి జెడ్పీ ఛైర్ పర్సన్ పిరియా విజయ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు, రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, నియోజక వర్గ పరిశీలకులు చింతాడ రవికుమార్, ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, బోర పుష్ప, పార్టీ నాయకులు కండియాల ప్రకాష్, వజ్జ మృత్యుంజయం, శిలగాన భాస్కరరావు, పాతిర్ల రాజశేఖర్, కారింగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ



అటెన్‌షన్ ప్లీజ్..!

- పదో తరగతి పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు
- మార్చి 18 నుంచి మొదలుకానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 145 కేంద్రాలు కేటాయింపు
- సీఎస్‌లు, డీఓలు, కస్టోడియన్లు, స్క్వాడ్‌ల నియామకం దాదాపుగా పూర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లాలో ఏర్పాట్లు పక్కాగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరగనున్న విషయం తెలిసిందే. నిమిషం ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతించబోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

145 కేంద్రాలు.. 30,574 మంది విద్యార్థులు

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో పదో తరగతి పరీక్షలు గత ఏడాది 149 కేంద్రాల్లో జరగగా.. ఈ ఏడాది 145 కేంద్రాల్లో జరగనున్నాయి. ఇందులో ఏ సెంటర్లు 55, బి-సెంటర్లు 28, సి-సెంటర్లుగా 62 కేంద్రాలను గుర్తించారు. కేటాయించిన పరీక్ష కేంద్రాలలో 90 శాతానికిపైగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా టెన్త్ పరీక్షలకు 30,574 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 28,982 మంది కాగా బాలురు 14,843 మంది, బాలికలు 14139 మంది ఉన్నారు. అలాగే ప్రైవేటు విద్యార్థులు 1,592 మంది ఉన్నారు. ఇందులో 975 మంది బాలురు, 617 మంది బాలికలు ఉన్నారు.

పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రాలపై అధికారులు ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం పర్యవేక్షించనున్నారు. పరీక్ష నిర్వహణకుగాను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్, జేసీ ఎం.నవీన్‌ల అధ్యక్షతన ఇప్పటికే పలుమార్లు సమీక్షించారు. పరీక్ష నిర్వహణకు 145 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 145 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 65 సి-సెంటర్లలో కస్టోడియన్లను నియమించారు. తనిఖీల కోసం రెవెన్యూశాఖ పర్యవేక్షణలో 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, మరో 15 సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నారు. ఎస్‌హెచ్‌ఓలుగా 34 మందిని నియమించారు. పరీక్షల నిర్వహణ కోసం 1350 మందిని ఇన్విజిలేటర్లగా నియమిస్తున్నారు. ప్రధానంగా 15 రూట్లను గుర్తించారు. ఇందుకుగాను 45 మంది రూట్ ఆఫీసర్లను నియమించారు. 20 వరకు రూట్లలో బస్సు సదుపాయాన్ని కల్పిస్తున్నారు. అలాగే టెన్త్ హాల్‌టిక్కెట్ చూపిస్తే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ప్రయాణించేలా ఉత్తర్వులు వెలువరించనుంది.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

సన్నద్ధం చేయాలి



మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగుతాయి. పరీక్షలకు విద్యార్థులను ఉన్నతంగా సన్నద్ధం చేయాలి. పరీక్ష కేంద్రాల్లో అధికారులు, తనిఖీ బృందాలు, సిబ్బంది నియామకం దాదాపుగా పూర్తయింది. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, ఫ్యాన్లు, ఫర్నీచర్, మరుగుదొడ్లు పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరి చేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీకాకుళం



జిల్లా కేంద్రానికి చేరుకుంటున్న పరీక్షల మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఏసీ ఆలీఖాన్

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

BUSINESS OFFER

కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-1252668]

WANTED

ఏకలవ్య ఫౌండేషన్, FPO కోఆర్డినేటర్-1, కొత్తూరు మండలం శ్రీకాకుళం. Qly: Any డిగ్రీ, M.S.Office, Salary: 20,000/-, Required Own Bike, Android Phone. Cont: 9666656261 [S-189795]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059863584. [M-1233856]

కష్టలెవ్వేనీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 9014885406. [HA-1261]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18k ఫోన్: 9160900024 / 9640400073 [HA-1254]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.